క్లుప్తంగా

ముగిసిన శ్రీరామ నవమి ఉత్సవాలు



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న పచ్చిరిపల్లి రాము

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దత్తత దేవాలయం, అల్లిపురం మెయిన్‌రోడ్డు శ్రీ కోదండ రామాలయంలో జరుగుతున్న శ్రీరామ నవమి ఉత్సవాలు ఆదివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన మహా అన్నసమారాధన కార్యక్రమాన్ని 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పచ్చిరిపల్లి రాము పాల్గొని ప్రారంభించారు. ఈ అన్నసమారాధన కార్యక్రమంలో సుమారు 2 వేల మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

ఎర్నిమాంబకు నవమి పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్ బాబా నేతృత్వంలో ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యే చర్యలు చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

నేడు అంబేడ్కర్ జయంతి

మహారాణిపేట: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రామారావు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎల్‌ఐసీ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలంకరణ, అనంతరం ఫుడ్ కోర్టు సమీపంలో బహిరంగ సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్, ఇతర అధికారులు, అంబేడ్కర్ ఆశయ సాధన కోసం పని చేసే వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేసిన్నట్లు తెలిపారు.

నేటి నుంచి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల స్వీకరణ

ఎంవీపీకాలనీ: ఎస్సీ కార్పొరేషన్ 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను అందిస్తున్న సబ్సిడీ రుణాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ ఒక ప్రకటనలో కోరారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 14వ తేదీ సోమవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. విశాఖ జిల్లాకు 406 యూనిట్ల సబ్సిడీ రుణాలను ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం కేటాయించినట్లు చెప్పారు. రూ.16.88 కోట్లతో 32 కేటగిరీల్లో లబ్ధిదారులకు రుణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి మే 10 వరకు https://apobmms.apcfss.in వెబ్‌సైట్ ద్వారా అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 21 నుంచి 50 ఏళ్ల లోపు వయసు గల వారు సబ్సిడీ రుణాలకు అర్హులని తెలిపారు. ఆధార్ కార్డ్, తెలుపు రేషన్ కార్డ్, పాన్‌కార్డ్, కుల ధ్రువీకరణ పత్రాలను అందజేయాల్సి ఉంటుందన్నారు. ట్రాన్స్‌పోర్ట్ వెహికల్స్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఈడీ పేర్కొన్నారు.

రామాలయంలో అన్నదానం



అన్నప్రసాదం వడ్డిస్తున్న కమిటీ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో చేపట్టిన వసంత నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం మహా అన్నదానం నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వహణ కమిటీ కార్యదర్శి సనపల వరప్రసాద్, అధ్యక్షుడు టీఎస్ రెడ్డి, సంయుక్త కోశాధికారి జీవీ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

దారి చూపే దివ్యక్షేత్రం



రక్షణగిరి ఆలయంలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

- వన్నెకెక్కిన జ్ఞానాపురంలోని రక్షణగిరి
- చిరకాలంగా క్రైస్తవులకు ప్రసిద్ధ ఆధ్యాత్మిక కేంద్రం
- నిరంతరం ప్రార్థనలు, సమర్పణలు
- గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ (పాస్కా) వేడుకలకు సిద్ధం

మోక్ష పథానికి మార్గం..

జ్ఞానాపురంలో ఆవిర్భవించి నాటి నుంచి గాలికొండ పాల్ మైపాన్ రూపకల్పనలో పెద్దల సలహా సహకారంతో ఈనాటి రక్షణగిరిగా కాగితపు మరియదాస్ క్రీస్తు శకం 1986 డిసెంబర్ 7వ తేదీన మేత్రాసన వందేళ్ల సంబరాన రూపొందింది. మేత్రాసనమును ఏసు తిరు హృదయానికి పునఃరంకితం చేశారు. ఈ మార్గంలో ఒక పక్క ఏసు కల్వరిగిరి మానవ పాప ప్రక్షాళన నిమిత్తం సిలువ రక్షణ యాత్ర సన్నివేశాలతోను, వేరొక పక్క క్రీస్తు జనన మరణ–పునరుత్థాన పరిపూర్తి అభిషిక్తయాత్ర సన్నివేశాలతో నిత్యం ప్రజానీకానికి ఆధ్యాత్మిక యాత్రలో మోక్షపథానికి నడిపించుచున్నది.

కంచరపాలెం: జ్ఞానాపురంలో క్రైస్తవులకు ప్రసిద్ధి చెందిన చర్చిలకు ఏళ్ల చరిత్ర ఉంది. పునీత పేతురు దేవాలయం, రక్షణగిరి, సెయింట్ పీటర్స్ ఆలయాలు నేటికీ కళకళలాడుతున్నాయి. రక్షణగిరిలో ప్రత్యేక ప్రార్థనలతో పాటు శుక్రవారం సాయంత్రం అన్నసమారాధనలు చేస్తున్నట్లు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ తెలిపారు. రక్షణగిరిపై జరిగే ప్రార్థనలతో మనస్సుకు ప్రశాంతత, ఆధ్యాత్మిక చింతన కలుగుతుందని ఇక్కడి క్రైస్తవుల ప్రగాఢ విశ్వాసం. కులమతాలకు అతీతంగా ఇక్కడ ప్రజలు ప్రార్థనలు చేస్తారని చర్చి ఫాదర్లు చెబుతున్నారు. ఈ నెల 18న గుడ్‌ఫ్రైడే–ఈస్టర్ (పాస్కా) వేడుకలకు రక్షణగిరి సిద్ధమవుతోంది.

క్రీస్తు రక్షకుని యాత్రలు..

రక్షణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలు ప్రతి ఏటా ఘనంగా జరుగుతాయి. మే మొదటి ఆదివారం క్రీస్తు రక్షకుని యాత్రా వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ తెలిపారు. ఏప్రిల్ 29 నుంచి మే 8 వరకు జరిగే ఉత్సవాలకు ఉత్తరాంధ్ర నుంచి క్రైస్తవులు తరలి వస్తుంటారు. తొమ్మిది రోజులు జరిగే వేడుకల్లో జపమాల, దివ్య బలి పూజలు నిర్వహిస్తుంటారు.



రక్షణగిరి క్షేత్ర మహోత్సవాలకు సిద్ధమైన మేరీమాత విగ్రహం

రక్షణగిరిపై నిత్య కార్యక్రమాలు

- ప్రతిదినం ఉదయం 6 గంటలకు దివ్యబలి అర్పనలు
- రేయింబవళ్లు మఠకన్యల నిత్యారాధన
- దినమంతా ఏసుప్రభువుతో భక్తుల భావ ప్రకటన (ఆరాధన)
- గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ వేడుకలను పురస్కరించుకుని 40 రోజులు ముందుగా తపోదీక్షల పేరిట జపమాల ధారణ.
- ప్రతి నెల మొదటి, మూడవ శుక్రవారాలలో ఉదయం 10 నుండి సాయంత్రం 4 గంటల వరకు ఉపవాస ఆరాధన కూటములు, దివ్యబలి అర్పణ.
- తపస్సు కాల శుక్రవారాలలో సిలువ మార్గ తపోక్రియలు
- జూన్ మొదటి ఆదివారం ఏసు తిరు హృదయ మహోత్సవ సంబరాలు
- ఆగస్టు 1 నుంచి 14 వరకు దేవమాత తేరు ఉత్సవాలు.. ఆగస్టు 15న ప్రధాన సంబరాలు



రక్షణగిరిపై గాలికొండ గుర్తుగా స్థూపం

అలనాటి గాలికొండ..

జ్ఞానాపురంలో ప్రసిద్ధి చెందిన గాలికొండ పరిశుద్ధాత్మ అనుగ్రహం కారణంగా రక్షణగిరిగా ఖ్యాతి సంతరించుకుంది. గాలి కొండపై దాదాపు 82 ఏళ్ల క్రితం ఏసు తిరుహృదయ స్వరూపాలను క్రీ.శ. 1927 జూన్ 15న పీటర్ రాసీలియన్ పీఠాధిపతులు సువిశాల విశాఖ మేత్రాసన ప్రభువునకు అంకితం చేశారు. చేతులు చాచి ప్రేమతో నశించిపోయిన ఆత్మలకు ఆహ్వానం పలుకుతూ, భారంతో కుంగుతున్న వారి బరువును తొలగిస్తు, పక్షిరెక్కల కింద సురక్షితంగా ఉన్న పిల్లల్లాంటి మనల్ని కాపాడుతున్న క్రీస్తు స్వరూపం ఆనాటి నుంచి జ్ఞానాపురంలో కొలువై ఉంది.



రక్షణగిరి ముఖద్వారం

ఆధ్యాత్మిక సుగంధాలకు నెలవు..



పాల్ మైపాన్ రూపకల్పనలో గాలికొండ దినదిన ప్రవర్ధమానమై, పెద్దల సలహా సహకారాలతో ఈనాటి రక్షణగిరిగా అభివృద్ధి చెందింది. రక్షణగిరి నేడు అనేక ఆధ్యాత్మిక సేవలకు నిలయంగా మారింది. ఈ నెల 18న గుడ్‌ఫ్రైడే, 20న ఈస్టర్ (పాస్కా) వేడుకలకు రక్షణగిరిని పూర్తిగా ముస్తాబు చేశాం. ప్రత్యేక ప్రార్థనలకు ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాం.

–రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్, రక్షణగిరి, జ్ఞానాపురం



గుడ్‌ఫ్రైడే వేడుకలకు సిద్ధమైన సెయింట్ పీటర్ ప్రధాన దేవాలయం

అంబేడ్కర్ జయంతికి వాసుపల్లి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని నియోజకవర్గ పరిధిలో నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. తన కార్యాలయంలో ఆదివారం ఈ ఆర్థిక సాయం చేశారు. 30వ వార్డు తాడివీధి సచివాలయం వద్ద, 34వ వార్డు కొబ్బరితోటలో సోమవారం నిర్వహించనున్న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆయా సంఘాల అధ్యక్షులు సబ్బవరపు శివ (యంగ్‌స్టార్స్ సంఘం), గాలి పార్వతి (అంబేడ్కర్ యువ సేవా సంఘం) ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమాలకు తన వంతు సాయంగా రూ.5 వేలు చొప్పున రూ.10 వేలు తన సొంత నిధుల నుంచి అందజేసినట్టు వాసుపల్లి తెలిపారు. భారత రాజ్యాంగం ద్వారా సమానత్వాన్ని, స్వేచ్ఛను అందించిన మహనీయుడు బాబా సాహెబ్ అంబేడ్కర్ అని కొనియాడారు. నాడు ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ కోట్లాది రూపాయలు అవినీతి రహితంగా పేదలకు చేరవేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అంబేడ్కర్ ఆలోచన విధానాన్ని అమలు చేసిన ప్రభుత్వం కూడా వైఎస్సార్‌సీపీయేనని గుర్తు చేశారు. మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు అంబేడ్కర్ వంటి మహనీయుల ఆశయాలు, ఇచ్చిన హామీలు తుంగలో తొక్కుతున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ విశాఖ జిల్లా ఆర్‌టీఐ అధ్యక్షుడు వడ్డాది దిలీప్, రాజేష్, పి. అప్పారావు, పుక్కల రవి, సురేష్, సబ్బవరపు గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారిని పరామర్శించిన ఎమ్మెల్యే మత్స్యలింగం



సమీరను పరామర్శిస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

మహారాణిపేట: అరకు నియోజకవర్గం, హుకుంపేట మండలం, మర్రిపుట్టు గ్రామానికి చెందిన చుంచు అనిల్ కుమార్ కుమార్తె చుంచు సమీర అనారోగ్యంతో శనివారం కేజీహెచ్‌లో చేరింది. విషయం తెలుసుకున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం కేజీహెచ్ భావనగర్ వార్డులో ఉన్న చిన్నారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం చిన్నారి ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. బాలికకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ వైద్యులు రేణుక తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం.. దుస్తుల పంపిణీ



అన్నదానం చేస్తున్న కొణతాల ఫౌండేషన్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: కొణతాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పాతనగరంలోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో సంఘ సేవకురాలు కొణతాల సీతాలక్ష్మి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఫౌండేషన్ చైర్మన్ కొణతాల వెంకట శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులతో పాటు పలువురు పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొణతాల శ్రీనివాస్ మాట్లాడుతూ స్వామి వివేకానంద సంస్థ ఎంతో మందిని ఆదుకుంటూ వారి శ్రేయస్సుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, వివేకానంద సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న రవికుమార్ తదితరులు

మహారాణిపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ వైద్య విభాగం ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. మహారాణిపేటలోని 29వ వార్డు పరిధి అంబేడ్కర్ విగ్రహ పరిసరాలను శుభ్రం చేసి, ముగ్గులు వేసి, జ్యోతి వెలిగించి రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళులు అర్పించారు. పార్టీ వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్, మహారాణిపేట మండల అధ్యక్షుడు దేవర చంద్రశేఖర్, మైనారిటీ మోర్చా నాయకులు సీహెచ్ రాజబాబు, శంకర రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



యేసుక్రీస్తు సువార్త ప్రకటిస్తూ ప్రదర్శన నిర్వహిస్తున్న మేరీ జోసెఫ్, సువార్త రాజు తదితరులు



స్లేవ్ గుర్తు వీధిలో మట్టలకు ప్రార్థన చేస్తున్న ఫాదర్ జాన్ ప్రకాష్

దాబాగార్డెన్స్: కృపామయ ప్రార్థన సహవాస సంఘంలో సేవకులు మేరీ జోసెఫ్, సంఘస్తులు సువార్త రాజు ఆదివారం ఘనంగా మట్టల ఆదివారం పండగ నిర్వహించారు. పాతనగరంలోని పలు ప్రాంతాల్లో ప్రభువైన యేసుక్రీస్తు సువార్తను ప్రకటిస్తూ సేవకులు ప్రదర్శన నిర్వహించారు.

కోటవీధిలో..

జీసస్ బ్లెసింగ్స్ మినిస్ట్రీ నేతృత్వంలో ఆదివారం కోటవీధి ప్రాంతంలో మట్టల ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ సురేష్, బ్రదర్ ఇ. విజయ్, సతీష్, బరుణ్‌కుమార్, సాల్మన్, ఇజ్రాయెల్ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ పీటర్ పునీత పేతురు ప్రధాన దేవాలయంలో..

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్ పునీత పేతురు ప్రధాన దేవాలయంలో రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ నేతృత్వంలో మట్టల (మ్రానీ కొమ్మల) ఆదివారం ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు మట్టలతో జ్ఞానాపురం వీధుల్లో ప్రార్థనలు చేశారు. ముందుగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు, దివ్యబలి పూజలు నిర్వహించారు. జ్ఞానాపురం, కంచరపాలెం, తాటిచెట్లపాలెం, అల్లిపురం తదితర ప్రాంతాల క్రైస్తవులు మ్రానీ కొమ్మలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ మాట్లాడుతూ క్రీస్తు ప్రభువును జెరూసలేం పట్టణంలోకి వచ్చే సమయంలో నాటి ప్రజలు మ్రానికొమ్మలతో స్వాగతం పలికినట్లు చెప్పారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి తపస్సు కాలంలో మ్రానికొమ్మల ఆదివారం నిర్వహిస్తారన్నారు. దైవపుత్రుని విజయోత్సవంగా జరుపుకుంటామని తెలిపారు. పరిశుద్ధ వారం ప్రాముఖ్యతను వివరించారు. సహాయ విచారణకర్తలు బైబిల్ చదివారు. ఈస్టర్ వరకు ప్రతి ఒక్కరూ ప్రతి రోజు చర్చిలో జరిగే ప్రార్థనల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఫాదర్లు వినయ్‌కుమార్, అంథోనీ రాజ్, పీపీసీ సభ్యులు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.



మట్టలతో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

అలయన్స్ డిస్ట్రిక్ట్ 105 గవర్నర్‌గా అట్లూరి



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఉషారాణి అట్లూరి

దాబాగార్డెన్స్: అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ విశాఖ డిస్ట్రిక్ట్ 105కి గవర్నర్‌గా ఉషారాణి అట్లూరి ప్రమాణ స్వీకారం చేశారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా ఆదివారం 2025–26 ఏడాదికి గాను గవర్నర్ హోదాలో విశాఖ జిల్లా స్థాయిలో పలు శాఖలు నిర్వహించే సేవా కార్యక్రమాలకు సంబంధించి నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్‌గా ఉషారాణి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సభ్యుల నమ్మకాని తగ్గట్లు అలయన్స్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న అలయన్స్ అంతర్జాతీయ అధ్యక్షుడు రాజ్‌కుమార్ సక్సేనా మాట్లాడుతూ ప్రతి సభ్యుడు సేవాభావంతో పనిచేస్తూ ఆలయన్స్ ఉన్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలయన్స్ వ్యవస్థాపకుడు, పూర్వ అంతర్జాతీయ స్థాయి అధ్యక్షుడు బి. తిరుపతిరాజు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఎస్. మహేశ్వరరావు, కాశీవిశ్వనాథ్, కె. శ్రీనివాస్, సీహెచ్ చందన, జె. అనురాధ, విశాఖ నగరానికి చెందిన అలయన్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కార్డియాలజిస్ట్ కావటమే లక్ష్యం

బైపీసీలో 988 మార్కులు సాధించిన ఉమ



కుమార్తె ఉమకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

సీతమ్మధార: ఆశీలమెట్ట నారాయణ కళాశాలలో చదువుతున్న కాళ్ల ఉమ ఇంటర్ బైపీసీలో 988 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంక్ సాధించింది. ఫస్టియర్‌లో 434 మార్కులు సాధించిన ఉమ ఎంబీబీఎస్ చదివి కారియాలజిస్ట్ కావాలనుకుంటున్నట్లు తెలిపింది. ఆమె తండ్రి కాళ్ల అప్పలరాజు రేషన్ డీలర్. తల్లి పద్మ గృహిణి. తాను చదువులో రాణించడానికి వారు ఎంతగానో ప్రోత్సహిస్తున్నారని తెలిపింది. తాను ఉన్నత స్థాయికి చేరుకుని వారికి మంచి గుర్తింపు తీసుకొస్తానని ఉమ తెలిపింది. అధ్యాపకుల గైడెన్స్‌తో మంచి మార్కులు సాధించగలిగానంది.

సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న నరసింహారావు

దాబాగార్డెన్స్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఈ నెల 24న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ధర్నాలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్‌వీ నరసింహారావు పిలుపునిచ్చారు. జగదాంబ సమీపాన గల సిటు కార్యాలయంలో ఆదివారం విశాఖ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం సర్వసభ్య సమావేశం జిల్లా అధ్యక్షులు పి. అనసూయ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న నరసింహారావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులను కూటమి ప్రభుత్వం పక్కదారి పట్టించిందన్నారు. వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులకు రావల్సిన సౌకర్యాలు నిలిపివేయడం దుర్మార్గమన్నారు. దేశంలో అనేక రాష్ట్రాల్లో వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులకు అనేక ప్రయోజనాలు అందుతుంటే.. మన రాష్ట్రంలో అందుకు భిన్నంగా వెల్ఫేర్ బోర్డు సొమ్ము ఇతర అవసరాలకు ఉపయోగించడం భావ్యం కాదన్నారు. ఎన్నికలకు ముందు కూటమి నాయకులు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన సంగతి గుర్తు చేశారు. ప్రమాదం జరిగి దెబ్బలు తగిలినా, మరణించినా ఏ విధమైన నష్టపరిహారం ఇవ్వడం లేదన్నారు. గతంలో పెళ్లిళ్ల, డెలివరీలకు, పిల్లల చదువులకు ఇస్తున్న నిధులు ఆపేశారన్నారు. యూనియన్‌గా కార్మిక శాఖ మంత్రిని కలిసి వినతి పత్రం అందజేస్తే.. కార్మిక శాఖ మంత్రి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల వల్లనే తాము గెలిచామని, తమ మొదటి ప్రాధాన్యత సంక్షేమ బోర్డు పునరుద్ధరించడమేనన్నారు. కానీ ఆ విధంగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. అందుకే ఈ నెల 24న ధర్నాలు చేయాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, బి. శ్రీనివాసరావు, పోలేశ్వరరావు, రామనాయుడు, నర్సింగరావు, పెంటారావు, రాజశేఖర్, సన్యాసిరావు, చంద్రమౌళి, రమణ, పెద్ద ఎత్తున భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

వ్యాయామంతోనే మెరుగైన నాడీ వ్యవస్థ

మురళీనగర్: నాడీ వ్యవస్థ సక్రమంగా పని చేయాలంటే వ్యాయామం తప్పనిసరని ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. వాకర్స్ హెల్త్ క్లబ్ వార్షికోత్సవం సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో మురళీనగర్‌లోని హరిత పార్క్‌లో 'పార్కిన్సన్ (వణుకుడు) వ్యాధిపై ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అరవై ఏళ్ల వయసు పైబడిన వారిలో మాత్రమే నాడీ కణాలు మెదడను దెబ్బ తీస్తాయని తెలిపారు. దీని వల్ల న్యూరోట్రాన్స్‌మీటర్ పని చేయకపోవడం వల్ల ఈ వ్యాధి వస్తుందని తెలిపారు. కాళ్లు, చేతులు, దవడల్లో వణుకు రావడం, కండరాలు బిగ దీయడం లేదా పట్టేయడం, పని వేగంలో తగ్గుదల, స్నానం, తినడం వంటి సాధారణ కార్యకలాపాలను కూడా ఆలస్యంగా చేస్తారన్నారు. నిరాశ, నిస్పృహలు, భయం, చొంగ కార్చడం, చర్మ, మూత్ర సమస్యలు వస్తాయని వివరించారు. వ్యక్తి మాటలు, చేతిరాతను దెబ్బ తీయడం ఈ వ్యాధి లక్షణాలని ఆయన తెలిపారు. నాడీ వ్యవస్థ సక్రమంగా పని చేయడానికి, మానసిక ఒత్తిడిని జయించడానికి భౌతిక, మానసిక వ్యాయామాలే దివ్య ఔషధంగా పని చేస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్కిన్సన్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లును ఘనంగా సత్కరించారు.